www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 8 అక్టోబరు 2023
5
ఏలూరు

'ఉపాధి' బకాయిలు విడుదల చేయండి : వ్యకాస

జంగారెడ్డిగూడెం:ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు విడుదల చేసి పే స్లిప్పులు అందించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల కార్యదర్శి అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం మాట్లాడుతూ మండలంలోని ఉపాధి హామీ వేతన బకాయిలు ఏప్రిల్ నుండి ఇప్పటి వరకూ రూ.40 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా పనికి తగ్గ వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఇప్పటికే మండలంలోని కూలీలు పనుల్లేక, చేసినా డబ్బులురాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వాలని అడుగుతుంటే వారిని బెదిరించడం సిగ్గుచేటని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల తొమ్మిది, పది తేదీల్లో ఏలూరులో జిల్లాస్థాయి శిక్షణ తరగతులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు పి.నీత, జోడే సూర్యచంద్రరావు, ఆనందరావు, సుబ్బారావు, నరసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చేప రైతు విలవిల..!

భారీగా తగ్గిన రూప్‌చంద్ ధర
కిలో రూ.70లోపే పలుకుతున్న దుస్థితి
కిలో చేప పెంపునకయ్యే ఖర్చు రూ.95
రెండు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో రూప్‌చంద్ సాగు
ధర పతనంతో లబోదిబోమంటున్న ఆక్వా రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రూప్‌చంద్ చేపల సాగు చేసే రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ధర భారీగా పడిపోవడంతో సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పరిస్థితి ఎప్పటికి కుదుటపడుతుందో తెలియక ఆక్వా రైతులు నలిగిపోతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రొయ్యల సాగు తర్వాత పెద్దఎత్తున రూప్‌చంద్ చేపల సాగు సాగుతోంది. వేలాది ఎకరాల్లో రూప్‌చంద్ సాగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. కొంతకాలం క్రితం వరకూ కిలో రూప్‌చంద్ చేప ఖరీదు రూ.వందకు పైగా ఉండేది. దీంతో రైతులకు ఇబ్బంది ఉండేది కాదు. పశ్చిమబెంగాల్, బీహార్ వంటి అనేక రాష్ట్రాలకు ఎగుమతి కావడంతోపాటు స్థానికంగా ఈ చేపలను ఎక్కువగా ఉపయోగిస్తారని చెబుతున్నారు. శ్రావణమాసం, వినాయకచవితి వంటి అనేక కారణాలతో ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు భారీగా తగ్గిపోయినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం కిలో రూప్‌చంద్ ధర రూ.70లోపే పలుకుతోంది. కిలో రూప్‌చంద్‌ను తయారు చేయడానికి అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ ఖర్చవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. మేత ఖర్చు ఎక్కువ మొత్తంలో అవుతుంది. ధర పతనంతో కిలో చేపకు రూ.25 వరకూ రైతులు నష్టపోతున్నారు. ఎకరా చెరువులో నాలుగు వేల నుంచి ఐదు వేల వరకూ రూప్‌చంద్ చేప పిల్ల వేస్తారు. దిగుబడి సైతం నాలుగు టన్నుల వరకూ వస్తుంది. ధర పతనంతో ఎకరాకు రూ.2.50 లక్షల వరకూ రైతులు నష్టపోతున్నారు. ఐదెకరాల చెరువుల్లో రూప్‌చంద్ సాగు చేస్తే దాదాపు రూ.12 లక్షల వరకూ రైతులు నష్టం చవిచూడాల్సి వస్తోంది. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. కనీసంగా కిలో చేప రూ.80కైనా కొనుగోలు చేయాలంటూ వ్యాపారులను రైతులు కోరుతున్నారు. ఆ విధంగా కొనుగోలు చేస్తే కొంతలో కొంత నష్టాలు తగ్గుతాయని రైతులు భావిస్తున్న పరిస్థితి నెలకొంది. వేల ఎకరాల్లో సాగుతున్న రూప్‌చంద్ చేపల సాగుపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఉంగుటూరు మండలంలో ఆక్వా రైతులు, ట్రేడర్స్ సమావేశమై కిలో రూప్‌చంద్ రూ.80కు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. ఇది అమలు జరుగుతుందో, లేదా అనేది చూడాలి. ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపి రైతులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది. రూప్‌చంద్ ధర తగ్గుదలపై మత్స్యశాఖ జెడి ఆర్‌విఎస్.ప్రసాద్‌ను వివరణ కోరగా రూప్‌చంద్ ధర కొంత తగ్గినమాట వాస్తవమేనన్నారు. దీనిపై ట్రేడర్స్‌తో మాట్లాడామని, మేత ధరలు తగ్గించడం వంటి చర్యలు చేపట్టమని వివరించారు.

రూ.80కు తక్కువ కాకుండా కొనుగోలు చేయాలని కోరాం

పొత్తూరి శ్రీనివాసరాజు, ఆక్వారైతు, ఉంగుటూరు

రూప్‌చంద్ చేప ధర బాగా తగ్గిపోయింది. రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది. కిలో చేప పెంపునకు అన్ని ఖర్చులూ కలుపుకుని రూ.95 వరకూ అవుతోంది. మార్కెట్లో ధర మాత్రం కిలో రూ.70లోపే ఉంది. ప్రస్తుత పరిస్థితి నుంచి రైతులు బయట పడాలంటే కిలో రూ.80కైనా కొనుగోలు చేయాలని ట్రేడర్స్‌ను కోరాం. ఆక్వారైతులు, ట్రేడర్స్ జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. 15వ తేదీన మరోసారి పెద్దఎత్తున సమావేశం నిర్వహించనున్నాం.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆ భోజనం తినలేకపోతున్నాం

కళాశాల ఎదుట ట్రిపుల్ ఐటి విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

'నీళ్ల చారు.. లావు బియ్యంతో అన్నం.. పులిసిన పెరుగు.. నాణ్యత లేని కూరలు తినలేకపోతున్నాం.. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోవడం లేదు. మాకు నాణ్యమైన భోజనం పెట్టండి.. ఈ భోజనం తినలేకపోతున్నాం' అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు శనివారం ఆ కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. తమకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించే చర్యలు చేపట్టే వరకూ ఆందోళన విరమించేది లేదని వారు భీష్మించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తమకు లావు బియ్యంతో భోజనం పెడుతున్నారని, దీంతో అన్నం ఉడుకుతుందని, తినలేకపోతున్నామని తెలిపారు. ఒక్కో విద్యార్థికి భోజనం నిమిత్తం రూ.90 నుంచి 110 వరకూ ప్రభుత్వం అందిస్తుందని, ఆ మొత్తంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించవచ్చని, కానీ కాంట్రాక్టర్ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. నాశిరకం కూరగాయలు, బియ్యంతో భోజనం వండి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భోజనం తిని తరచూ అనారోగ్యానికి పాలవుతున్నామని, కొన్ని సందర్భాల్లో పస్తులుంటున్నామని వారు వాపోయారు. ఇక్కడ భోజనం తినలేక తప్పనిసరి పరిస్థితుల్లో క్యాంపస్‌లో ఉన్న మరో ప్రయివేటు క్యాంటిన్‌లో భోజనం చేస్తున్నామని, దీనివల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అంతేకాక ఈ కళాశాలలో భోజనం, ఫ్యాకల్టీ సరిగా లేకపోవడం, విద్యాబోధనలో ఒత్తిడి వల్ల గతంలో 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరినా కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ, సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటి విద్యార్థుల సమస్యలపై పలుమార్లు ఆందోళన చేపట్టామని, ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేశామని అయినా కనీసం పట్టించుకోలేదన్నారు. మెస్ నిర్వహణ సరిగా లేదని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

మెస్ నిర్వహణ అధ్వానం : సిపిఎం

నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ఆందోళనకు సిపిఎం జిల్లా కమిటీ మద్దతు తెలుపుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు విద్యార్థుల సమస్యలపై వెంటనే స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. మెస్ నిర్వహణ అధ్వానంగా ఉందంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారని, నీళ్ల చారు, పులిసిపోయిన పెరుగు పెడుతున్నారని ఆందోళన చేయడం వారి సమస్య తీవ్రతను తెలియజేస్తుందన్నారు. మెస్ నాణ్యతను పెంచాలని, ఆరోగ్యకరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని కోరారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళన న్యాయబద్ధమైనదని తెలిపారు. సమస్య పరిష్కారానికి డైరెక్టర్ కృషి చేయాలని కోరారు.

మెస్ కమిటీ ఏర్పాటు చేస్తాం

విద్యార్థుల ఆందోళనకు స్పందించిన నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. భోజనశాలను పరిశీలించి ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపిస్తామని చెప్పారు. కళాశాల డైరెక్టర్ శ్రీనివాస్ భోజన నాణ్యతపై మెస్ కమిటీని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కమిటీలో మెంబర్స్‌తో పాటు విద్యార్థులు కూడా ఉంటారని తెలిపారు. నిత్యం మెస్‌లో ఆహారాన్ని తనిఖీ చేయడం, నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు భోజనం అందించేలా తగిన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఆందోళన విరమించారు.

ఏలూరు:నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు పెడుతున్న భోజనం నాణ్యంగా ఉండటం లేదని, తినేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లెనిన్ మాట్లాడారు. భోజనం బాగోలేదని అనేకసార్లు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఇప్పటివరకూ నూజివీడు ట్రిపుల్ ఐటిలో 20 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని దాని గురించి సరైన విచారణ కూడా జరిపించలేదన్నారు. భోజనం నిమిత్తం ఒక్కో విద్యార్థికి రూ.90 నుంచి రూ.110 వరకూ ప్రభుత్వం చెల్లిస్తుందని, కానీ నాణ్యమైన భోజనం పెట్టడంలో అధికారులు, మెస్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. భోజనం విషయంలో అనేకసార్లు అధికారుల దృష్టికి ఎస్‌ఎఫ్‌ఐ తీసుకెళ్లినా, సరి చేస్తామని చెప్పి నాలుగు రోజులు సక్రమంగా పెడుతున్నారని, తర్వాత షరామామూలైపోతుందని విమర్శించారు. సమస్యను పరిష్కరించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు యశ్వంత్, వినోద్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నారపల్లి రమణరావు

సంక్షేమ బోర్డు నిధులు తిరిగి జమచేయండి

ప్రజాశక్తి - కైకలూరు

దారి మళ్లించిన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను తిరిగి జమ చేయాలని, బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కైకలూరు నియోజవర్గ కమిటీ సమావేశం కైకలూరులోని సంఘ కార్యాలయంలో అంకం త్రిమూర్తులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రమణరావు మాట్లాడుతూ. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టం అమలు చేయాలన్నారు. ప్రభుత్వం 1214 మెమో ఇచ్చిందని ఈ మెమోను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ క్లయిములు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, రాబోయే కాలంలో చలో రాష్ట్రవ్యాప్త పిలుపును విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాగిరెడ్డి కొండలరావు. పోతురాజు బాలాజీ, అల్లాడి వీరయ్య, నాగిరెడ్డి శ్యాము. కొటికల శ్రీనివాసు, పైలా శ్యాము పాల్గొన్నారు.

పార్వతి మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు అంగన్‌వాడీ కార్యకర్త డి.పార్వతి మృతి ఆమె కుటుంబానికి, సిఐటియుకు తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. అనారోగ్యంతో మంగళగిరి ఎయిమ్స్‌లో పదిరోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి పార్వతి శనివారం మృతిచెందారన్నారు. 2006లో అంగన్‌వాడీ కార్యకర్తగా చేరిన పార్వతి తన విధులను నిబద్ధతతో నిర్వహిస్తూ అధికారుల ఆదేశాలు అమలు చేశారన్నారు. అలాగే సిఐటియు నాయకురాలిగా, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యురాలిగా విశేష సేవలందించారని కొనియాడారు. విద్యావంతురాలైన ఆమె తమ సహచరులకు కంప్యూటర్ విద్యను నేర్పడంలోనూ, కంప్యూటర్ వినియోగం పట్ల అవగాహన కల్పించడంలోనూ, వివిధ యాప్‌ల వినియోగం ఇతరులకు తెలియజేయడంలో చురుకైనా పాత్ర పోషించేవారని తెలిపారు. ఆమె మృతదేహాన్ని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్, ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు అధ్యక్షురాలు బి.రాజామణి, సిఐటియు మండల శాఖ అధ్యక్షురాలు జి.స్వర్ణ కుమారి సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇద్దరు మహిళా ఎస్‌ఐలు బదిలీ

ఏలూరు స్పోర్ట్స్:ఏలూరు పట్టణంలో ఇద్దరు మహిళా ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు నగరంలోని ఎస్‌పి కార్యాలయంలో పిసిఆర్ కంట్రోల్ రూములో గత కొంతకాలంగా కంట్రోల్ రూమ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న క్రాంతిప్రియను ఏలూరు దిశా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా బదిలీ చేశారు. దిశా పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న నిహారికను కంట్రోల్ రూముకు బదిలీ చేశారు.

భూములు ఆన్‌లైన్ చేయాలని ఆందోళన

టి.నరసాపురం:మండలంలోని అల్లంచర్ల రాజుపాలెంలో ప్రభుత్వం పంపిణీ చేసిన సాగు భూములను సబ్‌డివిజన్ చేసి ఆన్‌లైన్ చేయాలని కోరుతూ శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 2005 భూపంపిణీ చేసిందని తెలిపారు. అప్పటి నుంచి సాగు చేస్తున్నప్పటికీ ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రభుత్వం నుండి అందే రైతు భరోసా, ఇతర రాయితీలు పొందలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ములకయ్య, దుర్గారావు, శారద, రాంబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.

రీ సర్వే రికార్డు సక్రమంగా ఉండాలి : ఆర్‌డిఒ

జీలుగుమిల్లి:మండలంలో భూముల రీ సర్వేకు సంబంధించిన రికార్డ్ వర్క్‌ను సక్రమంగా నమోదు చేయలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మండలంలో జరుగుతున్న రీ సర్వే పనులను ఆరాతీశారు. అనంతరం రీ సర్వే రికార్డ్ పనులను పారదర్శంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భూములకు సంబంధించి బౌండరీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎఎస్‌ఒ వీరేంద్రనాథ్, విఆర్‌ఒ తులసి పాల్గొన్నారు.

25 గ్రామాల్లో 9549 ఒపి నమోదు

ఏలూరు:జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం 25 గ్రామాల్లో నిర్వహించిన మెడికల్ క్యాంపుల్లో 9423 ఒపి నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ట తెలిపారు. వీరిలో మహిళలు 5259 మంది, పురుషులు 4164 మంది ఉన్నారు. ఆరోగ్య పరీక్షల అనంతరం 107 మందికి మెరుగైన వైద్యం కోసం ఆయా ఆసుపత్రులకు రిఫర్ చేశామన్నారు. వివిధ అనారోగ్య సమస్యలున్న 9423 మందికి ఉచితంగా మందులు అందించామని చెప్పారు. ఏలూరు కొత్తపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో 126 ఒపి నమోదు కాగా వారిలో 90 మంది మహిళలు, 36 మంది పురుషులున్నారని తెలిపారు.

రూ.4వేలు జీతమివ్వలేని స్థితిలో వైసిపి

స్కూల్ స్వీపర్ల ఐదో రోజు నిరాహార దీక్ష ప్రారంభంలో కాంగ్రెస్ నేత రామ్మోహన్‌రావు

దీక్షను ప్రారంభిస్తున్న రామ్మోహన్‌రావు

ప్రజాశక్తి - ఏలూరు

నెలకు రూ.నాలుగు వేలు జీతం కూడా ఇవ్వలేని స్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ నగర అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు అన్నారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్ల ఐదు నెలల జీతాల కోసం డిఇఒ కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్ష శిబిరాన్ని ఐదో రోజు శనివారం రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం నుండి సాయంత్రం వరకూ రోజుకు పది గంటలు పని చేయించుకుంటూ ఇవ్వాల్సిన రూ.నాలుగు వేలు జీతం కూడా సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం, హైకోర్టు తీర్పు ప్రకారం నెలకి రూ.ఎనిమిది వేలు ఇవ్వాల్సి ఉండగా అందులో సగంజీతం మాత్రమే చెల్లిస్తూ, అవికూడా సకాలంలో ఇవ్వకపోవడం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. స్కూల్ స్వీపర్ల బకాయి జీతాలు తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్కూల్ స్వీపర్ల బకాయి జీతాల కోసం చేస్తున్న ఆందోళనకు తమ పార్టీ పూర్తిమద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమస్యను జిల్లా ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకుని పరిష్కారం చేయాలని కోరారు. కాంగ్రెస్ నేత బాబు ప్రసాద్ పాల్గొని తన మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, కెవిపిఎస్ నాయకులు పి.బాలరాజు కూడా పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్ స్వీపర్ల భిక్షాటన

మున్సిపల్ స్కూల్ స్వీపర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. తమ ఐదు నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక డిఇఒ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకూ భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఖాళీ కంచాలతో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి 15 మాసాలవుతున్నా విద్యాశాఖ అధికారులు స్కూల్ స్వీపర్ల జీతాలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, ఆటో డ్రైవర్ల యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి జె.గోపి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, కెవిపిఎస్ నాయకులు పి.బాలరాజు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ భిక్షాటన కార్యక్రమానికి స్కూల్ స్వీపర్లు జె.స్వాతి, చలమల విజయలక్ష్మి, ఎస్.కృష్ణవేణి భాస్కర్, వెంకటరమణ, పద్మజ, చిట్టెమ్మ, దుర్గమ్మ, హఫీజ్ ఉన్నీసా, నూర్జహాన్, లక్ష్మీరాజ్యం, రమణమ్మ, నాగమణి, ఆదిలక్ష్మి, జగలక్ష్మి, రామలక్ష్మి, రత్నమణి, జ్యోతి, మాధవి, జ్ఞానేశ్వరి నాయకత్వం వహించారు.

భిక్షాటన చేస్తున్న మున్సిపల్ స్కూల్ స్వీపర్లు

బాలల హక్కుల పరిరక్షణ బాధ్యత అందరిదీ

ఏలూరు:బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెకెవి.బుల్లికృష్ణ అన్నారు. శనివారం 'బాలల సంరక్షణ, న్యాయ సహాయం' అంశంపై సదస్సు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లికృష్ణ మాట్లాడుతూ సంస్థ బాలల స్నేహపూర్వక న్యాయ సేవలు, వారిరక్షణ నిమిత్తం అనేక చట్టాలను రూపొందించారని, బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాలల పోషణ, విద్య, ఆరోగ్యం తదితర సౌకర్యాలను తప్పనిసరిగా కల్పించాలని, బాల్యవివాహాలను నిరోధించాలని, బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని అలాగే పుట్టిన ప్రతి బిడ్డకూ పోషక పదార్థాలు అందజేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని తెలిపారు. అలాగే అనాధ బాలలకు పునరావాసం కల్పించాలని సూచించారు. దిశా డిఎస్‌పి మురళీకృష్ణ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు పోలీస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేయాలని ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపైన అవగాహన కల్పించుకోవాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపైనా ఉందని సూచించారు. అలాగే సుబ్బారావు మాట్లాడుతూ కోర్టులో దాఖలు చేసిన ప్రతి కేసునూ ముందుగా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిపిఒ సూర్య చక్రవేణి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ రెబ్కారాణి పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై సంఘటితంగా పోరాడాలి



మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - చింతలపూడి

రైతాంగ సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. చింతలపూడి మండలం రాఘవాపురం శివారు అంకులయ్య కొత్తగూడెంలో రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన నరసింహ, శ్రీనివాస్ మాట్లాడుతూ రైతాంగ సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రైతులు సంఘటిత పోరాట ఫలితంగా గ్రీన్ హైవే భూ నిర్వాసిత రైతులకు పరిహారం పెరిగిందని చెప్పారు. అయితే రైతులకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో సర్వీస్ రోడ్లు నిర్మించాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం, అధికారులు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయిల్ పామ్ గెలల ధర దారుణంగా పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది టన్ను ఆయిల్ పామ్ గెలల ధర రూ.23 వేలు ఉంటే ప్రస్తుతం రూ.12,900కు పడిపోయిందన్నారు. టన్ను గెలలకు రూ.18 వేలు ప్రకటించాలని కోరారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొబ్బరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని, ధాన్యం కొనుగోలు సమస్యలు పరిష్కరించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో ఏలూరులో జరిగే రైతు సంఘం జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గంటా పాపారావు, అనుమోలు మురళీ, రైతులు చీకటి వెంకటేశ్వరరావు, జి.సీతారామయ్య, మట్టా సత్యనారాయణ, చీకటి ఉమారాణి, కరెడ్ల అన్నం, జి.కృష్ణయ్య, సిహెచ్.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

విలవిల..!

బకాయి వేతనాల కోసం స్కూల్ స్వీపర్ల దీక్షలు.. మూడు నెలలుగా జీతాలందక సమగ్ర శిక్ష ఉద్యోగుల ఆందోళనలు.. లోటు వర్షపాతంతో మెట్ట రైతులు లబోదిబోమంటున్నారు. ఇటు ప్రభుత్వ తీరు.. అటు ప్రకృతి కన్నెర్రతో రెండు జిల్లాల్లో వివిధ తరగతుల ప్రజలు విలవిల్లాడుతున్నారు.

స్కూల్ స్వీపర్లు సుమారు 300 మందికిపైగా రెండు జిల్లాల్లోని ఏలూరు, భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు తదితర మున్సిపాల్టీల్లో పని చేస్తున్నారు. వీరికి గతంలో ఆయా మున్సిపాల్టీలే జీతాలు చెల్లించేవి. వీరు పార్ట్‌టైమ్ కంటింజెంట్ వర్కర్స్‌గా చెబుతున్నా ఉదయం నుంచి సాయంత్రం వరకూ గదులు, గ్రౌండ్ శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పోయడం వంటి పనులన్నీ చేస్తూ ఫుల్‌టైమ్ వర్కర్లుగానే ఉన్నారు. వీరికి ఇచ్చే వేతనం మాత్రం రూ.4 వేలు మాత్రమే. 2022 ప్రభుత్వం జిఒ తీసుకొచ్చి వీరిని విద్యాశాఖలో విలీనం చేసింది. అయితే విద్యాశాఖాధికారులు మాత్రం వీరికి వేతనాలివ్వడం లేదు. అయితే మున్సిపల్ అధికారులు ఇప్పటి వరకూ తమ అధీనంలో పని చేశారనే సానుకూల దృక్పథంతో 2023 మార్చి వరకూ వేతనాలు చెల్లించారు. అయితే విద్యాశాఖకు వెళ్లారనే జిఒ కారణంగా ఏప్రిల్ నుంచి వీరికి మున్సిపాల్టీలు వేతనాల చెల్లింపు నిలిపివేశాయి. జిఒ ప్రకారం వేతనాలివ్వాల్సిన విద్యాశాఖ మొద్దునిద్ర వీడటం లేదు. ఫలితంగా గత ఐదు నెలలుగా వేతనాలు లేక చిరుద్యోగులైన స్కూల్ స్వీపర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతూ, పేరుకు పార్ట్‌టైమ్ కంటింజెంట్ వర్కరే అయినా స్కూల్‌లోనే పూర్తి టైమ్ ఉంటూ వేరే పని చేసే అవకాశం లేక, మరోపక్క కొద్దిపాటి వేతనమూ అందక ఆ కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. సుమారు ఐదు రోజులుగా తమ బకాయి వేతనాలు ఇవ్వాలని స్కూల్ స్వీపర్లు ఏలూరులోని డిఇఒ కార్యాలయం వద్ద నిరాహారదీక్షలు చేపట్టినా అటు విద్యాశాఖాధికారులుగాని, ఇటు అధికారపార్టీ ప్రజాప్రతినిధులుగానీ స్పందించకపోవడం బాధాకరం. వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాలు, రాజకీయ పక్షాలు సైతం రూ.నాలుగు వేలు వేతనం కూడా బకాయిలు పెట్టడంపై ప్రభుత్వ తీరును ఎండగడుతూ స్కూల్ స్వీపర్లకు సంఘీభావం ప్రకటిస్తున్నారు. ఇదే పరిస్థితి సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల దుస్థితి. ఇప్పటికి మూడు నెలలుగా వేతనాల్లేక ఆ శాఖలోని వివిధ తరగతుల సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తమకు వేతనాలిప్పించాలంటూ గాంధీ జయంతి నాడు గాంధీ విగ్రహాలకు వినతులిచ్చి నిరసన తెలిపారు. వీరికి జీతాలివ్వడానికి బడ్జెట్ లేదంటున్న విద్యాశాఖ ఉన్నతాధికారులు మాత్రం కొంతమంది ఎంపిక చేసిన విద్యార్థులతో అమెరికా పర్యటనకు వెళ్లొచ్చారు. విద్యార్థులను ఈ తరహా పర్యటనకు తీసుకెళ్లడం కచ్చితంగా అభినందనీయమే. అయితే ఆ శాఖలో పని చేసే స్కూల్ స్వీపర్లకు, అనుబంధ విభాగమైన సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలివ్వకుండా పస్తులుంచడం ఎంతవరకూ న్యాయమో ప్రభుత్వం, ఉన్నతాధికారులే చెప్పాలి.

ఇక జిల్లాను లోటు వర్షపాతం వెంటాడుతోంది. ఇటీవలకాలంలో ఎన్నడూ లేనివిధంగా వర్షాభావంతో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో పరిస్థితి దారుణంగా తయారవుతోంది. చెరువులు అడుగంటడం, బోర్లు సరిగ్గా పని చేయని పరిస్థితి రావడంతో పంటలు ఎండిపోవడంతో పాటు పశువులు దాహార్తితో అలమటిస్తున్నాయి. ఇప్పటికే గత నాలుగు నెలల్లో జులై మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం లోటు స్పష్టంగా లెక్కలు చెబుతున్నాయి. అయినా ప్రభుత్వంగానీ, జిల్లా అధికారులుగానీ దీనిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. ప్రత్యామ్నాయ పంటల సాగు, పశువుల తాగునీటి కోసం ప్రత్యేక చర్యలతోపాటు ఆయా ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు చూపడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. లేనిపక్షంలో పచ్చని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కరువు కోరలు చాచే ప్రమాదం పొంచి ఉంది. ఎన్నికల హడావుడిలో నిమగ్నమైన అధికార పక్షం, అధికారులు ఈ సమస్యలపై ఇప్పటికైనా దృష్టి సారించకపోతే కచ్చితంగా ఎన్నికల్లో ఆయా శక్తులు, ప్రజలు గుణపాఠం చెబుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్రత్యామ్నాయ పంటలు చూసుకోవాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వర్జీనియా పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు చూసుకోక తప్పదని రాజమహేంద్రవరం రీజనల్ మేనేజర్ ఎం.ఆదిశేషయ్య పేర్కొన్నారు. కొయ్యలగూడెం వర్జీనియా వేలం కేంద్రంలో వేలం నిర్వహణ అధికారి గ్రేస్ మార్గరెట్ అధ్యక్షతలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. వర్జీనియా పొగాకుతో సమానంగా ఉద్యాన పంటలు కూడా అభివృద్ధి చెందుతాయని వారు వివరించారు.

ప్రభుత్వాసుపత్రిలో పెరిగిన జ్వర బాధితులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజురోజుకీ జ్వర పీడితుల సంఖ్య ఎక్కువవుతుంది. శనివారం ఆసుపత్రిలో అత్యవసర విభాగంలోకి పదిమందికి పైగా జ్వరంతో బాధపడుతున్న వారు చేరారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాల వారు వైరల్ ఫీవర్ కారణంగా ఆసుపత్రులో చేరుతున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల్లో భాగంగా జ్వరాలు వస్తున్నాయన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వాహన చోదకులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని తుక్కులూరు గ్రామ శివారులో శనివారం వాహన చోదకులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సిఐ బాల సురేష్ మాట్లాడుతూ మైనారిటీ తీరనివారికి వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలి, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న ఎడి రామకృష్ణ

వరి, మినుము పంటల పరిశీలన

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పోలవరం రెవెన్యూ గ్రామంలో శనివారం ఇ-క్రాప్ నమోదైన వరి, మినుము పంటలను సామాజిక తనిఖీ(సూపర్ చెక్కు) కొరకు జిల్లా వ్యవసాయ అధికారి వై.రామకృష్ణ క్షేత్రస్థాయి పరిశీలన చేసి, రైతుల వివరాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీలో భాగంగా ఇ-క్రాప్ నమోదు సరిగా ఉన్నది లేనిది, వారి పేరు మీద ఎన్ని ఎకరాలు ఇ-క్రాప్ నమోదు అయినదీ లేనిదీ, జలధారం యొక్క వివరాలు, విస్తీర్ణం ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు వంటి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు కిలపర్తి రమణబాబు, పైలా సుబ్బారావు, తదితర రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నేటి సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలకు గురి కాకుండా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఛత్రపతి శివాజీ శ్రీ శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు తెలిపారు. శనివారం కళాశాల స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని నేషనల్ కాన్ఫరెన్స్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన ఫ్యూచర్ ఛాలెంజెస్ అండ్ అపర్చునిటీస్ ఇన్ సైబర్ సెక్యూరిటీ అంశంపై కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ప్రసాద్ బాబు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు సైబర్ నేరాలకు లోను కాకుండా ఉంటారన్నారు. అలాగే రిసోర్స్ పర్సన్ ఆన్లైన్ వాట్సాప్, ఫేస్బుక్, ఇ-మెయిల్, మొబైల్ హ్యాకింగ్ ఏవిధంగా జరుగుతాయనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ మెంబర్ ఎం.వెంకటేశ్వరరావు, కిరణ్ కుమార్, మ్యాథమెటిక్స్ డిపార్ట్మెంట్ సిహెచ్.ఐధి నారాయణ, శ్రీకాంత్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, యు.వెంకటాచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిఎం నుంచి అందుకున్న ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రధానోపాధ్యాయిని రాధికా రాణి తెలిపారు. మండలంలోని గొల్లపల్లి గ్రామం అంబే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం విద్యార్థులకు రాబోవు పరీక్షలను ఉద్దేశించి అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. గత సంవత్సరం పిఎం 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో మనోధైర్యం, ఆత్మ విశ్వాసంతో అత్యధిక మార్కులు సాధించడానికి సూచనలు జారీ చేశారు. పరీక్ష పే చర్చలో పాల్గొన్న 29 మంది విద్యార్థులకు పిఎం నుంచి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, కృష్ణవేణి, మోహన రావు, రంగారావు, బాలు, విఠల్ బాబు, రాంబాబు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బియ్యం లారీ - పాలవ్యాన్ ఢీ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని వేగవరం వద్ద గత అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులకు గాయాలు అవ్వడంతో పాటు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. శనివారం తెల్లవారు జామున మండలంలోని వేగవరం సమీపంలో నల్గొండ జిల్లా నుంచి కాకినాడ పోర్టుకు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ కొయ్యలగూడెం నుండి జంగారెడ్డిగూడెం వైపు వెళ్తున్న పాల వ్యాన్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. క్షతగాత్రులను 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్కు తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కిలో మీటర్ వరకు ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం కృషి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మీర్జాపురం గ్రామంలో శనివారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్ నడుపుతున్న షేక్ కరీముల్లా(34) తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలోని వారు అందించిన సమాచారంతో క్షతగాత్రుడిని 108 అంబులెన్స్లో విజయవాడ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి భార్య మెహిరున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆశా వర్కర్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

పెదనిండ్రకొలనులో పిహెచ్సి డాక్టర్కు వినతిని అందిస్తున్న ఆశాలు

నూజివీడులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - నిడమర్రు

గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉద్యోగ నిర్వహణలో చనిపోయిన ఆశావర్కర్ రేపూడి కృపమ్మ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని ప్రజాసంఘాల కార్యాలయంలో సిఐటియు మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పిల్ల హరి కుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ నష్టపరిహారం కోసం ఆందోళన చేస్తున్న గుంటూరు తాడేపల్లి యూనియన్ నాయకులను అరెస్టు చేసి, అక్రమ కేసులు బనాయించి, కార్మిక సంఘాలను భయభ్రాంతులకు గురి చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. అనంతరం పెదనిండ్రకొలను పిహెచ్సి డాక్టర్ తేజశ్రీకి వినతిని సమర్పించారు. ఈ సమావేశంలో ఆశా యూనియన్ నాయకులు అల్లు సత్యవతి, బి.లక్ష్మి, ఎ.పద్మ, సిఐటియు నాయకులు కంచ వరప్రసాద్, కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : తాడేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆశా వర్కర్ కృష్ణమ్మ కుప్పకూలి మృతి చెందారు. ఆమెకు ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ఆశా వర్కర్లు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు అందరూ నిరసన ప్రదర్శన చేశారు.

కలిదిండి : గుంటూరు జిల్లాలోని ఆశా వర్కర్ కృష్ణమ్మ విధులు నిర్వర్తిస్తూ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మండలంలోని కోరుకొల్లు, కలిదిండి, మూలలంక పిహెచ్సిల వద్ద ఆశా వర్కర్స్ సిఐటియు అధ్వర్యంలో నిరసన తెలిపారు. కృష్ణమ్మను వేధింపులకు గురి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, ఆశాలకు పనిభారం తగ్గించాలని, కృష్ణమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.అరుణా దేవి, షేక్ రహిమున్నిసా, దాసరి విజయ, రమాదేవి, నాగలక్ష్మి, కాంతామణి, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

పెదవేగి మండలం జానంపేట మరియపురం క్యాంపస్ నందు లైన్స్ ఇంటర్నేషనల్ విజన్ ఏలూరు లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సర్వీస్ కోఆర్డినేటర్ చుక్కా అవినాష్ రాజు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఆరోగ్యంతో ఉంటే అన్నీ ఉన్నట్లేనని ఆయన తెలిపారు. ఏలూరు విజన్ లైన్స్క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ఈ క్యాంపులో విజయవాడ కామినేని హాస్పిటల్, వంకాయ గూడెం గుడ్ సెమ్ రిటన్ హాస్పిటల్, ఏలూరు సూర్య హాస్పిటల్ నుంచి వైద్యులు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. వచ్చిన ప్రజలకు గుండె, బిపి, షుగర్, శస్త్ర చికిత్సలు, గ్యాస్ ట్రబుల్, కీళ్ల నొప్పులకు చికిత్స అందజేశారు. స్త్రీల వ్యాధులకు సంబంధించిన సూచనలు అందించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ షుగర్ వ్యాధి నిపుణులు డాక్టర్ కొడాలి రామ్ ప్రసీన్, బుర్ర మురళీకృష్ణ, హాస్పిటల్ గైనకాలజీ నిపుణులు డాక్టర్ అనూష, గుడ్ సామ్ రిటన్ హాస్పిటల్ జనరల్ వ్యాధి నిపుణులు చంద్ర, సూర్య హాస్పిటల్ డాక్టర్ జి.సాహితీ, గుడ్ సామిరెడ్డి హాస్పిటల్ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ అక్బర్ బాషా, సూర్య హాస్పిటల్ డాక్టర్ ఆలీ, డాక్టర్ జిఎస్ ప్రకాష్, ఫిజీషియన్ క్రాంతి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మత్యస్ కొల్లి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులకు మందులు అందిస్తున్న వైద్యులు

టిడిపి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బత్తులవారిగూడెంలో టిడిపి మండల అధ్యక్షుడు ముసునూరు రాజా ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముసునూరు శాంతమ్మ, వెంకట సుబ్బారావు, బోస్ పాల్గొన్నారు.

టి.నర్సాపురం: తిరుమలదేవి పేటలో కాంతితో కాంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ముక్కొల్లుపాడు గ్రామంలో చంద్రబాబుకు మద్దతుగా నిర్వహించిన దీక్షలో తెలుగు రైతు నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు జగ్గవరపు వెంకటరెడ్డి, పర్వతనేని సాయికృష్ణ, కలగర రాజా, వక్కలగడ్డ సాల్మన్‌రాజు, జగ్గవరపు చంద్రారెడ్డి, కాంతారావు, సురేష్, నాగశేషు, నాగరాజు, పర్వతనేని పుష్పలత, రాణి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అక్రమ కేసులను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ అధ్యక్షతన దీక్షాశిబిరంలో 26వ రోజు నాయుడు శ్రీనివాసరావు, సంభాని వెంకటేశ్వరరావు, మాంద్రురాజు, పదలం శ్రీతేజ, దేవళ్లరామయ్యలు పాల్గొన్నారు. వీరికి చింతలపూడి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీకృష్ణ, టిడిపి నాయకులు షేక్ ముస్తఫా, పరిమి సత్తిపండు, ఆకుమర్తి రామారావు, రాజాన సత్యనారాయణ, తూటికుంట రాములు, జనసేన చింతలపూడి కన్వీనర్ మేక ఈశ్వరయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా రామారావు, షేక్ యాకోబ్, పట్టణ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడుని ప్రభుత్వం అరెస్ట్ చేసిన తీరు సరికాదని టిడిపి ఏలూరు పార్లమెంటు నాయకులు గోరుముచ్చు గోపాల్ యాదవ్ తెలిపారు. శనివారం స్థానిక గోకుల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం జంగారెడ్డిగూడెం పట్టణ తెలుగు రైతు అధ్యక్షులు మాణికల నాగేశ్వరావు నివాసంకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : జగన్‌మోహన్ రెడ్డి భరతం పట్టి ప్రజా క్షేత్రంలో ఘోరీ కడతామని నూజివీడు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు యనమదల ఉషారాణి తెలిపారు. గ్రామంలో టిడిపి కుటుంబ సభ్యులు, తెలుగు మహిళలు కలిసి బాబుతో నేను కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి బాబుతో నేను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి కుటుంబ సభ్యులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో రిలే నిరాహార దీక్షలో సర్పంచి గద్దల సుహాసిని, గద్దల మోహన్ రావు, ఎంపిటిసి సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల సత్యనారాయణ, పర్వతనేని వెంకటేశ్వరరావు, సోంగా ఇసాక్, గద్దల పుల్లారావు, పిన్నిబోయిన మంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బాబుతో మేము సైతం, కాంతితో కాంతి కార్యక్రమంలో భాగంగా చింతలపూడిలో టిడిపి కార్యాలయం వద్ద జనసేన, టిడిపి నాయకులు కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కన్వీనర్ ముత్తారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు చీదరాల మధుబాబు, జనసేన జిల్లా నాయకులు తూము విజయకుమార్, టిడిపి నియోజకవర్గ మహిళా నాయకురాలు యాళ్ల లీలా ప్రశాంతి, టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు బోడ అనీష్ కుమార్, బోడ బుషణం, చిట్లూరి ధర్మరాజు, అంకమ్మరావు, రాజారెడ్డి, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయి : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిర్వహించిన కాంతితో క్రాంతి అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి పార్టీ కార్యాలయంలో లైట్స్ ఆఫ్ చేసి బయటకు వచ్చి సెల్‌ఫోన్ టార్చ్‌లైట్స్ లతో, కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : కన్నాయిగుడెం గ్రామంలో టిడిపి నేతలు, కార్యకర్తలు, లోకేష్ పిలుపు మేరకు 7 గంటల నుంచి 7:5 నిమిషాల వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. బాబు అరెస్ట్ అక్రమం అని, జైలు నుంచి విడుదల చెయ్యాలని వారు నిరసన వ్యక్తం చేశారు.

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీలో రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కాంతితో కాంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, వడ్డే శ్రీను, కె.వీర్రాజు, ఎం.దుర్గారావు, ఎం.సురేష్, నాగు, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి : చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసులు ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు ఆపకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలు వైసిపి ప్రభుత్వానికి తగు గుణపాఠం చెబుతారని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

కొత్తపట్టిసీమలోని కార్యక్రమంలో మట్లాడుతున్న ఎంఎల్ఎ బాలరాజు

అంకంపాలెంలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల-2 కొత్త పట్టిసీమ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పోలవరం నియోజవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించి ప్రజల ఆరోగ్యాలకు రక్షణ, భద్రత కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలిని తెలిపారు. అనంతరం మండలంలోని కొంద్రుకోట ఆర్అండ్ఆర్ కాలనీలో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, కొత్త పట్టిసీమ పంచాయతీ సర్పంచి మైగాపుల విజయ దుర్గ, ఎంపిటిసి వలవల వరలక్ష్మి, కొంద్రుకోట పంచాయతీ సర్పంచి నాగరాజు, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, వైసిపి నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, వలవల బాలాజీ, ప్రజలు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ వర్కర్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని గొల్లగూడెంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో మెడికల్ క్యాంపును తహశీల్దార్, క్యాంప్ ప్రత్యేక అధికారి ఎవి రమణారావు ప్రారంభించారు. దీనికి ముందు గ్రామంలో వాలంటీర్లు, హెల్త్ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి 327 మందికి టోకెన్లు పంపిణీ చేశారు. వారందరికీ వైద్యాధికారులు వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి శంషుద్దీన్, వైసిపి నాయకులు మలకలపల్లి నాగు, దాసరి సత్యనారాయణ, పంచాయతీ యాళ్ల కార్యదర్శి కిషోర్ బాబు, సచివాలయ ఉద్యోగుల సిబ్బంది పర్యవేక్షించారు. అవసరమైన వారికి ఔషధాలను పంపిణీ చేశారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె ఎస్.వర్మ, స్పెషలిస్ట్ డాక్టర్ ఆల్బర్ట్, ఇతర వైద్యులు సేవలు అందించారు.

చింతలపూడి : ప్రతిఒక్కరికి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నట్లు యండపల్లి సర్పంచి యడ్ల మోహన్ రావు తెలిపారు. యండపల్లి మల్లేశ్వరాం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి, ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎట్కస్ ఎంపిపి గుత్తా కిషోర్ పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ : పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు మండల ఎంపిపి బత్తుల రత్నకుమారి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్, మండల ప్రభుత్వాధికారులు, డాక్టర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : ఆరోగ్యశ్రీ అమలవుతున్న ఆసుపత్రుల్లో చికిత్స నిమిత్తం రోగులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు తెలిపారు. ఈ విషయమై వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శనివారం నూజివీడు ఎస్‌కెహెచ్ పాఠశాల మెట్ట గూడెంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఇ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ విజయ్ కుమార్, జడ్‌పి వైస్ ఛైర్మన్ కృష్ణంరాజు, ఎంపిపి శిరీష, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పేదలకు ప్రత్యేక వైద్యం అందించడం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు కోర్స పోసమ్మ తెలిపారు. శనివారం మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచి బుద్దా జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షులు సంద ప్రసాద్, ఎఎంసి డైరెక్టర్ బోధా శ్రీనివాస్, ఎంపిటిసి నాలీ శ్రీను, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, ఎంఇఒ శ్రీనివాస్, స్పెషలిస్ట్ డాక్టర్లు నాగదేవి, గాయత్రి, పలువురు వైద్య సిబ్బంది, మూలకాల బాబు, బయ్య వెంకట్రావు, రవి పాల్గొన్నారు.

టి.నరసాపురం : జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా తెలిపారు. మండలంలోని ఎపిగుంట గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మంగా కుమారి, సర్పంచి శ్రీదేవి, వైద్యాధికారులు ఫణీంద్ర బాబు, ఆంజనేయులు, బాలాజీ, శరత్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి పేదవాడికి వైద్యం అందేలా చర్యలు చేపట్టడం ఆనందదాయకమని జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బలివే గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తహశీల్దార్ దాసరి సుధా, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి ఆధ్వర్యంలో వైద్య సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎం.కిరణ్ కుమార్, డాక్టర్ కరిముల్లా, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశాలు, అంగన్‌వాడీలు, ఎంపిడిఒ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త కె.శ్యాంబాబు తెలిపారు. పట్టణంలో శనివారం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్యాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వివిఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గ్రామాలలో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని నూజివీడు ఎంపిపి టి.శిరీష తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులకు వివరించారు. గ్రామాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామ పంచాయతీ మహాదేవపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం : 45/6 లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లు లేని దళిత పేదలకు నిర్మాణం నిమిత్తం పంచుతామని తెలిపారు.

మోటార్ కిట్లు అందిస్తున్న అధికారులు

జలకళ మోటార్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కామవరపుకోట

కామవరపు కోట ఎండిఒ ఆఫీస్‌లో సాయంత్రం 3 గంటల నుంచి వైఎస్ఆర్ జలకళ మోటార్ కిట్లు పంపిణీ చేశారు. వైఎస్ఆర్ జలకళ పథకంలో సబ్సిడీపై డెక్కన్ మోటార్ 10 హెచ్‌పి, 300 అడుగుల వెళ్లే 2 అంగుళాల ట్యూబ్, కరెంట్ సర్వీస్ వైర్, డెక్కన్ స్టార్ట్ బాక్స్, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ఇందులో కళ్లచెరువు, కామవరపు కోట, సాగిపాడు, తడికలపూడి, వీరిశెట్టి గూడెం ఈస్ట్ యడవల్లి, రామన్నపాలెం రైతులు ఈ కిట్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పురుషోత్తం, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధరరావు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న సభ్యులు

వాహనమిత్ర నగదు మంజూరు

ప్రజాశక్తి - కామవరపు కోట

కామవరపు కోట చౌతన సెంటర్ నందు వీరభద్ర ఆటో యూనియన్ సభ్యులు తీన్మార్ డప్పులతో సంబరాలు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే సెప్టెంబర్ 28వ తేదీన సిఎం జగన్‌మోహన్ రెడ్డి 5వ విడత వాహన మిత్ర పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు రూ.10 వేల నగదును నేరుగా వారి బ్యాంక్ అకౌంట్‌కి మంజూరు చేశారు. దీంతో ఆటో డ్రైవర్లు సంతోషంతో సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి దండవేసి, తీన్మార్ డప్పులతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ గూట్ల విష్ణు, వైస్ ప్రెసిడెంట్ కరిని శ్రీనివాసు, కిషోర్, వారణాసి లక్ష్మణరావు, ఎమాంద్రు రాజేష్, గుద్దేటి శ్రీను, అంకాలంపాడు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామంలో పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం, మా సమస్యలు పరిష్కరించాలంటూ గ్రామస్తులు సర్పంచిని కోరారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సర్పంచికి వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ నిధుల ప్రాధాన్యతను బట్టి ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు.

దస్తావేజులు పోయినవి

గణపవరం మండలం, అగ్రహారం గోపవరం గ్రామానికి చెందిన మీసాల మధు, తండ్రి: ప్రభాకరరావుకు చెందిన 122-6B నెంబరు గల దస్తావేజులు శనివారం మా గ్రామం నుండి గణపవరం వెళ్ళి జిరాక్సు తీయించుకుని ఆటోలో తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికితే ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

మీసాల మధు
తండ్రి: ప్రభాకరరావు, డో.నెం. 2-135,
చర్చి వీధి, అగ్రహారం గోపవరం,
గణపవరం మండలం, ప.గో॥జిల్లా.
సెల్: 96181 62767